క్లుప్తంగా

ఘనంగా చిన్మయ మిషన్ మాతృపితృ పూజ



మాతృపితృ పూజలో పాల్గొన్న బాలబాలికలు

ఉక్కునగరం: చిన్మయ మిషన్, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాతృపితృ పూజ ఘనంగా నిర్వహించారు. చిన్మయ మిషన్ 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వామి రఘువీరానంద ఆధ్వర్యంలో 'బాలల కూల్ క్యాంప్ ' నిర్వహించారు. క్యాంప్ ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. పిల్లలకు తల్లిదండ్రులపై గౌరవభావాలు పెంపొందించే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంపై తల్లిదండ్రులు చిన్మయ మిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్యాంప్‌లో పాల్గొన్న బాలబాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ కార్యదర్శి జయంతి కుమార్‌తో పాటు పలువురు స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

సామూహిక ధ్యానం విజయవంతం



ధ్యానంలో పాల్గొన్న మహిళలతో నిర్వాహకులు

పెదగంట్యాడ: వినాయక పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీలలో నిర్వహించిన సామూహిక ధ్యానం విజయవంతమైంది. ఈ సందర్భంగా కందుకూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ రామచంద్రమూర్తి మాట్లాడుతూ ధ్యానం విశిష్టతను వివరించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. మండపేట సీనియర్ పిరమిడ్ మాస్టర్ అన్నపూర్ణ, పిరమిడ్ స్పిరిట్యూచువల్ సొసైటీ మూమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

గాజువాక: 67వ వార్డు గణేష్‌నగర్‌లోని కొండపై కొలువైన విజయదుర్గ అమ్మవారికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం 108 కలశాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈనెల 16 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న అమ్మవారి పండుగ మహోత్సవాలను పురస్కరించుకొని చేపట్టిన ప్రత్యేక పూజల్లో భాగంగా అమ్మవారికి అభిషేకాలను నిర్వహించారు. ఈ ఏడాది కూడా అమ్మవారి పండుగ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నాయకులు కోరారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, అప్పారావు, సింహాచలం, ఆదినారాయణ, గురునాథ్, వెంకటేష్, ఆదిలక్ష్మి, సుబ్బు, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

'మెగాస్టార్ ఫ్యాన్' చిత్రం రిలీజ్ పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్ : మెగాస్టార్ ఫ్యాన్ చిత్రం రిలీజ్ పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం సిటీ చిరంజీవి ఫ్యాన్స్ యువత అధ్యక్షుడు వానపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగింది. అల్లు ప్రొడక్షన్ బ్యానర్‌పై కిరణ్ వారియర్ దర్శకత్వంలో లుక్స్ రాజ్ హీరోగా, సోనిరెడ్డి హీరోయిన్‌గా అల్లు శ్రీరాములునాయుడు నిర్మాతగా నిర్మించిన ఈ చిత్రం పోస్టర్ రిలీజ్ నగరంలోని క్రాంతి పిక్చర్స్ కార్యాలయంలో నిర్వహించారు. క్రాంతి పిక్చర్స్ అధినేత ఎన్‌వీ రెడ్డి మాట్లాడుతూ చిరంజీవి సమాజానికి అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రం నిర్మించామమన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..



ఓపెన్ జిమ్ వద్ద చిన్నారుల సందడి



వినాయకనగర్ ఆదర్శగ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

పెదగంట్యాడ: వేసవి సెలవులను విద్యార్థులు ఎంజాయ్ చేస్తున్నారు. ఉదయం.. సాయంత్రం వేళల్లో చిన్నా పెద్దా తేడాలేకుండా అందరూ మైదానాల్లో వివిధ రకాల ఆటల్లో మునిగితేలుతున్నారు. గ్రామాలు మొదలు పట్టణాల వరకూ మైదానాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్‌తో స్థానిక క్రీడలు ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. నడుపూరు పైడిమాంబ ఆలయ మైదానంలో, వినాయకనగర్ ఆదర్శ మైదానంలో చిన్నారులు వివిధ క్రీడలు ఆడుతూ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుంటున్నారు. అలాగే ఓపెన్ జిమ్‌ల వద్ద చిన్నారులు సందడి చేస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో అక్కడ చేరి ఉత్సాహంగా గడుపుతున్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో పనిచేయని లిఫ్ట్

- తరచూ మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో మరమ్మతులకు గురైన లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఉన్న ఏకైక లిఫ్ట్ ఎప్పటికప్పుడు మొరాయిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ లిఫ్ట్ మరమ్మతులకు గురవుతుండడంతో ప్రయాణికులు లగేజీలు, వృద్ధులు, పిల్లలతో నానా హైరానా పడుతున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్‌ప్లాట్ ఫారంపై పది నెలల క్రితం లిఫ్ట్ ఏర్పాటు చేశారు. విజయవాడ మీదుగా వచ్చే ప్రయాణికులు ఎక్కువ మంది ప్రయాణికులు ఇక్కడ దిగుతున్నారు. వీరు ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపు వెళ్లడానికి నాలుగో నంబర్‌ప్లాట్‌ఫారంపై పైనున్న లిఫ్ట్‌ను వినియోగిస్తున్నారు. అయితే లిఫ్ట్ నెలకు కనీసం ఒకటి రెండు సార్లు మరమ్మతులకు గురవుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం నుంచి లిఫ్ట్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొత్తమ్మతల్లి అమ్మవారి మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



అమ్మవారి జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి గ్రామదేవత కొత్తమ్మ తల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకొని చేపట్టనున్న కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాలను ఆలయ కమిటీ ఆవిష్కరించింది. ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విజయరామరాజు, ప్రగడ వేణుబాబు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. 15వ తేదీన ఉజిడి తొలడం, 17వ తేదీన పుట్ట బంగారు మహోత్సవం, 18న ఘటాల ఊరేగింపు, 24న తొలేళ్ల పండగ, 25వ తేదీన అమ్మవారి ఊరేగింపు, అనుపు మహోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూరిశెట్టి పెంటారావు, బొడ్డ గోవింద్, ప్రగడ శ్రీను, చిత్రాడ సన్యాసిరావు, మార్పు శేషు, దుగ్గపు దానప్పలు, అతికంశెట్టి రవి, గొనప సన్యాసినాయుడు, పారిపల్లి, బొడ్డ సన్యాసిరావు, వడ్లపూడి ఈశ్వరరావు, ఎస్.పాపారావు, సాగి సీతారామరాజు, ప్రగడ శంకరరావు పాల్గొన్నారు.

కూలి పనుల నుంచి తొలగించవద్దు

అగనంపూడి: ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ ఆధారంగా చేసుకొని తనను అన్యాయంగా కూలి పనుల నుంచి తొలగించారని ఉక్కు హార్టీకల్చర్‌సొసైటీ సభ్యురాలు దేవర అప్పలకొండ ప్రాంతీయ కార్మిక శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు అగనంపూడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అందరికీ ఉద్యోగాలు సాధ్యం కాకపోవడంతో అప్పట్లో అగనంపూడి, వడ్లపూడి, పెదగంట్యాడ, గంగవరం ప్రాంతంలోని నిరక్షరాస్యులు, ఉపాధి లేనివారి కోసం హార్టీకల్చర్ సొసైటీలను ఏర్పాటు చేశారని, ఆ సొసైటీల ద్వారా ఉక్కునగరంలోని పార్కుల్లో మొక్కల పెంపకం, గడ్డిని ముళ్లపొదలను తొలగించడం వంటి పనులు నిర్వాసిత నిరుద్యోగులకు అప్పగిస్తున్నారన్నారు. చేసేది కూలిపని అయినా పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పిస్తుండడంతో ఈ పనులు చేసేందుకు ముందుకు వస్తున్నామన్నారు. నిరక్షరాస్యత వల్ల అప్పట్లో ఆధార్‌కార్డులో నా పుట్టిన తేదీని ఎక్కువగా నమోదు చేశారని, ఇప్పుడు దీన్నే ఆధారంగా చూపించి వయోభారం అంటూ సొసైటీలో పనుల నుంచి తనను తొలగించడం సబబుకాదని ఆమె ఆవేదన చెందారు. ఈవిషయంలో తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పట్టా రామ అప్పారావు పాల్గొన్నారు. ఈవిషయంలో తనకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

14 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం శ్రీవారి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్ర తినిధులు తెలిపారు. జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు 4 రోజుల పాటు వేదపండితులతో విశేష పూ జలు, హోమాలు, అర్చనలు నిర్వహించనున్నారు.

కార్యక్రమాల వివరాలు:

14వ తేదీన: ఆరోజు సాయంత్రం తిరుమలేశుని సన్నిధిలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అజస్ర దీపారాధన, మేధినీ పూజ, అంకురార్పణం , వాస్తు పూజ, వాస్తు హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తారు.

15వ తేదీన: ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 5.30 గంటలకు తోమాల సేవ, 6.30 గంటలకు అర్చన, 7 గంటలకు భక్తులకు సర్వదర్శనం, 7.30 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఆచార్యవరణం, రిత్విక్ వరణం, అకల్మష హోమం, గరుడ ప్రతిష్ఠ, ఆదివాసత్రయం, ఆదివాసత్రయ హోమం, లఘు పూర్ణాహుతి, నీరాజనం, మంత్రపుష్పం. సంతానం లేని మహిళలకు శ్రీ వారి గరుడ ప్రసాదం సాయంత్ర 7 గంటలకు అందజేయనున్నట్టు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

16వ తేదీన: ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు అర్చన, 7 గంటలకు భక్తులకు శ్రీవారి దర్శనం, 7.30 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హో మం, ఉక్త హోమం, ధాతాది మూల హోమం , స్వా మి వారి మూల మంత్ర హోమం, బలిహరణ, నీరాజనం, మంత్ర పుష్పం, 9.30 గంటలకు శ్రీ వారి పెద్ద శేష వాహన సేవ, తీర్థ ప్రసాద వితరణ జరుపబడును.

సాయంత్రం: 6.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, పారమాత్మిక మహాశాంతి హోమం , బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం, రాత్రి 8.00 గంటలకు శ్రీ వారి గరుడ వాహన సేవ (గరుడోత్సవం) నిర్వహిస్తారు.

17వ తేదీన: ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు అర్చన, 7 గంటలకు శ్రీ వారి సర్వదర్శనం, 7.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, ఉక్త హోమం, సర్వ దైవత్య హోమం, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 9.30 గంటలకు సూర్య ప్రభ వాహన సేవ, 11 గంటలకు శ్రీ వారి ఉత్సవ బింబాలకు అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 5.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, స్వామి మూల మంత్ర హోమం, బలిహరణ, 6 గంటలకు స్వామికి ముత్యాల పందిరి వాహన సేవ, 7 గంటలకు శ్రీ వారి ప్రథమ వార్షిక కళ్యాణోత్సవం, నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ జరుపబడును.

18వ తేదీన: ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు అర్చన, శ్రీ వారి దర్శనం, 7.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, ఉక్త హోమం, స్వామి వారి మూల మంత్ర హోమం, మహా పుణ్యాహుతి, బలిహరణ, 10 గంటలకు వసంతోత్సవం, శ్రీ వారి స్నపన తిరుమంజనం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ఎన్‌సీవోఏ ఉప ప్రధాన కార్యదర్శిగా కాటం



నూతన ఉపాధ్యక్షుడు కాటం చంద్రరావును అభినందిస్తున్న ప్రసాద్

ఉక్కునగరం: నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌సీవోఏ) ఉప ప్రధానకార్యదర్శిగా ఉక్కు అధికారుల సంఘం (సీ) అధ్యక్షుడు కాటం చంద్రరావు నియమితులయ్యారు. ఈనెల 7 నుంచి బెంగళూరు హెచ్ఏఎల్ అకాడమీ ప్రాంగణంలో జరిగిన ఎన్‌సీఓఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా 2024–26కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సెక్రటరీ జనరల్‌గా అనీల్ కుమార్, ఉప ప్రధానకార్యదర్శిగా కాటం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్టీల్ ఫెడరేషన్ చైర్మన్ ఎస్.కె. బంబోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కుసుమ రాజశేఖర్‌లు ఎన్నికయ్యారు. సమావేశాలకు హాజరైన సీ ప్రధానకార్యదర్శి కేవీడీ ప్రసాద్ ఉక్కు కర్మాగారం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం చేసేలా సహకరించాలని కోరారు. కాటం చంద్రరావు మాట్లాడుతూ మారిన రాజకీయ పరిస్థితుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్, నగర్ నార్ ప్లాంట్లను సెయిల్‌లో విలీనం చేయడానికి అనుకూల అవకాశాలు ఉన్నాయన్నారు. అదే విధంగా హయ్యర్ పెన్షన్ అంశంపై కేంద్ర కార్మిక మంత్రిని కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రంలో ఎన్‌సీఓఏ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సండే సందడి

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందడిగా మారాయి. అనకాపల్లి, గవర్ల అనకాపల్లి, వెంకటాపురం, భర్నికం, పరవాడ, లంకెలపాలెం, సబ్బవరం, అగనంపూడి, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరంలో ఉత్సాహంగా గడిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం జలకాలటలతో ఉత్సాహంగా గడిపారు.



తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ● శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండంలోని వేదికపై అధిష్ఠంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

మరిడమ్మా...కాపాడమ్మా...



పొలిమేర వద్ద ఘటాలతో మహిళలు

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత మరిడమ్మ పండగను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. దుష్ట శక్తులు, క్షుద్రశక్తులు గ్రామంలోకి రాకుండా చల్లగ చూడాలని పూజలు చేశారు. చిన్నా పెద్దా అంతా కలిసి అమ్మవారిని పొలిమేరకు సాగనంపారు. ఈ ఘట్టాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామపొలిమేర దేవత మరిడమ్మకు రెండేళ్లకోసారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా తన అక్కచెల్లెళ్ల వద్దకు పొలిమేర నుంచి వచ్చేసిన మరిడమ్మను మళ్లీ సాగనంపే కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు.

బ్రహ్మకుమారీల నూతన ధ్యానమందిరం ప్రారంభం



నూతన ధ్యానమందిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు, బ్రహ్మకుమారీలు



కార్యక్రమంలో పాల్గొన్న ధ్యానులు, బ్రహ్మకుమారీలు

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అగనంపూడిలోని దివ్య జ్యోతి భవనం సారథ్యంలో నిర్మితమైన ధ్యాన మందిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న భవనం ఆవరణంలోనే మూడో అంతస్తులో ధ్యాన మందిరం కోసం నిర్మించిన ఫ్లోర్‌ను ప్రారంభించారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బీకె వేణి అక్కయ్య, కోఆర్డినేటర్ సోమేశ్వరి అక్కయ్య అగనంపూడి ఇన్‌చార్జ్ బీకే రామకోటి పర్యవేక్షణలో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని రాజస్థాన్‌లోని మౌంట్ అబూ నుంచి విచ్చేసిన బీకే వేడి భాయీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగనంపూడి బ్రాంచ్ ద్వారా లోక కల్యాణం, విశ్వశాంతి కోసం దివ్యజ్యోతి భవనం నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి శిక్షణ పొందే 150 మంది బ్రహ్మకుమారీలు ఉండేందుకు వీలుగా సౌకర్యం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బీకే వేణి అక్కయ్య మాట్లాడుతూ మనిషి ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడానికి, ధ్యానంతో మానసిక ప్రశాంతతను కల్పించేందుకు వీలుగా ఇక్కడ ధ్యానులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యోగా బట్టీలు నిర్వహించడం ద్వారా పరిసర ప్రాంతంలో పాజిటివ్ ఆలోచనలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజయోగి బీకే సోమేశ్వరి అక్కయ్య, ఇన్‌చార్జ్ రామకోటి, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, జి.పూర్ణానందశర్మ, నక్కా రమణబాబు, విద్యావేత్తలు టి.బలరామకృష్ణ, బొండా అప్పారావు మాస్టార్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఎల్.వి.రమణ, వివిధ బ్రాంచ్‌ల ఇన్‌చార్జ్‌లు, ధ్యానులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



మాట్లాడుతున్న దొమ్మేటి అప్పారావు

అగనంపూడి: కేంద్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విశాఖ హెచ్ఎంఎస్ నాయకులు దొమ్మేటి అప్పారావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1214వ రోజు ఉక్కు హెచ్ఎంఎస్ యూనియన్ సారథ్యంలో దీక్షా శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపేశక్తి, సత్తా ఇప్పుడు రాష్ట్రంలోని పార్లమెంట్ సభ్యులకు ఉందన్నారు. గతంలో పవన్ కల్యాణ్ తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో, అసెంబ్లీలో నిలదీస్తానని చెప్పారని, ఆయనపార్టీకి కూడా ఇద్దరు ఎంపీలు ఉన్నందున బీజేపీ మిత్రపక్షంగా ఉన్న జనసేన ఆ దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు గొందేసి సత్యారావు, యు.అప్పారావు, వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



రిలే దీక్షలో పాల్గొన్న భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు వెనక్కు తీసుకోవాలని భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీటు ఆధ్వర్యంలో 1,244వ రోజు చేపట్టిన రిలేని నిరాహార దీక్షలో భెల్ సీటు నాయకులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో పాల్గొన్న భెల్ సీటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ మూడేళ్లకు పైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో కార్మికులు ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సనపల జగన్నాథరావు, సత్యనారాయణ, అల్సి అప్పలనాయాయణ, కె.నారపురెడ్డి, చైతన్య, జి.అచ్చం నాయుడు, పి.శివరాం, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేయాలి



దువ్వాడ రైల్వేస్టేషన్ వద్దనున్న ఆటోస్టాండ్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. దీర్ఘకాలంగా ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నా అధికారులు కనీసం పట్టించుకోపోవడం వల్ల ప్రయాణికులు మండిపడుతున్నా రు. ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ లేకపోవడం వల్ల కొంతమంది ఆటో డ్రైవర్లు ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తున్నారని, ఆటో డ్రైవర్లు అడిగిన మొత్తం చెల్లించకపోతే మరి ఏ ఇతర ఆటోలను రానివ్వడం లేదని, దీంతో ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యంగా మారిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రాత్రి 8 గంటలు దాటిన తరువాత కూర్మన్నపాలెం నుంచి రాజీవ్‌నగర్ రావాలన్నా కనీసం రెండొందలకు తగ్గకుండా డిమాండ్ చేస్తున్నారని సుబ్బారావు అనే ప్రయాణికుడు వాపోయాడు. తాను రెండు రోజుల క్రితం విజయవాడ నుంచి దువ్వాడ వచ్చానని అక్కడ నుంచి కూర్మన్నపాలెంకు ఆటో మాట్లాడితే రెండొందలు ఇస్తే వస్తానని డ్రైవర్ డిమాండ్ చేశాడన్నారు. ఆటోలన్నీ ఏకమై ఆ మొత్తం చెల్లిస్తే తప్పా ఆటో రానివ్వలేదని ఆయన ఆవేదన చెందారు. ఆటోల భారం తప్పాలంటే ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఉంటేనే ప్రయాణికులకు న్యాయం జరుగుతుందని అంటున్నారు.

విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్లా చినతల్లి

గాజువాక: హెచ్ఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్ ఏర్పాటు చేసిన విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ప్రారంభించారు. బీవీఎస్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ పేరుతో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో 30 క్రికెట్ టీమ్‌లు పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లా పెంటారావు, నిర్వాహకులు దిలీప్, బోసు, ప్రశాంత్, నరేష్, శ్రీనివాసరావు, శివ తదితరులు పాల్గొన్నారు.